"ఇల్లుందిగా! అమ్మేసి కట్టేద్దాం. వచ్చే ఏడాది మరో ఇల్లు కొనుక్కోవచ్చు" అన్నాడు.

"మరి చెల్లి పెళ్ళి. . .?"

"దాని పెళ్ళికేం . . . లక్షల కట్నంఇచ్చి వైభవంగా చేస్తాను. మొదట అమెరికా వెళ్ళనీ!" అన్నాడు. అతని మొహంలో ఆశ మళ్ళీ వెలుగుతూ.

వేణు వాళ్ళ నాన్నగారు వెళ్ళి బతిమాలుకుంటే మూడులక్షలకు ఒప్పుకున్నాడు ఏజెంట్. ఆ తర్వాత విషయాలు చాలా వేగంగా జరిగిపోయాయి.

అమెరికాలోని ఓ సంస్థ వేణుకు ఉద్యోగం ఇవ్వడానికి అంగీకరించింది. టెలిఫోన్‌లో ఇంటర్వ్యూ కూడా జరిగింది. హెచ్ 1 వీసా వచ్చేసింది. విమానం టిక్కెట్లు రిజర్వ్ అయ్యాయి. వేణు అమెరికా వెళ్ళే రోజు నాకు ఓ వైపు సంతోషం, మరో వైపు దాచుకున్నా దాగని ఈర్ష్య. ఆరు నూరైనా సరే నేను కూడా అమెరికా వెళ్ళాలని బలంగా నిర్ణయించుకున్నాను.

"నేను వెళ్ళాక అక్కడి పరిస్థితులు వివరిస్తూ ఉత్తరం రాస్తాను. అప్పుడు కోర్సులో చేరుదువుగాని" అని భుజం తట్టాడు వేణు.

అందరి కళ్ళల్లో ఆనందభాష్పాలు . . . .

వేణు వెళ్ళినప్పటి నుంచి ప్రతీ రోజూ సాయంత్రం వాళ్ళు అద్దెకుంటున్న ఇంటి కెళ్ళి వారిని పరామర్శించి వస్తున్నాను. వేణు నుంచి ఉత్తరం రాగానే నలభైవేలు కట్టి కోర్సులో చేరాలని తహతహ. . . . అసహనంతో ఎదురు చూపు. . . . ఉత్తరం రాలేదు. వేణూయే తిరిగి వచ్చేశాడు.

అందరి మొహాల్లో పసిఫిక్ మహాసముద్రమంత దిగులు!

నేను చాలా ఆందోళన పడుతూ అడిగాను ఏమైందని.

"ఇక్కడ కోర్సు చేసిన వాళ్ళెవరూ మెయిన్ ఫ్రేమ్ మీద పనిచేయటానికి పనికి

